
వనపర్తి పాలకేంద్రం సమీపంలోని మైదానంలో రైతు నిరసన సదస్సుకు పూర్తయిన ఏర్పాట్లు

# రైతన్న కోసం..

నేడు వనపర్తిలో రైతు నిరసన సదస్సు

- హాజరుకానున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి
- రైతు భరోసా.. రుణమాఫీకి ప్రభుత్వంపై కర్షకుల పోరాటం
- భారీగా రైతులను తరలించేందుకు ఏర్పాట్లు

వనపర్తి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : అన్నదాతలకు అండగా నిలుస్తామన్న కాంగ్రెస్ మాటలు నీటిమూలయ్యాయి. పంట రుణమాఫీ, రైతుభరోసా పెంపు హామీలతో రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక రైతుభరోసాకు రాంరాం పాడగా, రూ.2లక్షల్లోపు రుణమాఫీని కొందరికే చేసి చాలా మంది రైతులను నిండాముంచారు. 30శాతం కూడా మాఫీ చేయకపోవడంతో వనపర్తి జిల్లా రైతాంగం తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉంది. ఇక రైతుభరోసాను వానకాలం సీజన్‌లో పూర్తిగా నిలిపి వేసినట్లు ఇటీవలే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో రైతులకు ప్రభుత్వ పరిస్థితి పూర్తిగా అర్థమైంది.

**రుణమాఫీ అంతంతే..**

ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేశామని ప్రకటించింది. అయితే, జిల్లాలో వివిధ కారణాలతో ఇంకా వేలాది మందికి రుణమాఫీ కాలేదు. అర్హత ఉండి మాఫీ కాని రైతులు గతంలో పలుచోట్ల ఆందోళనలు చేశారు. మాకెందుకు మాఫీ చేయరంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికీ ఇంకా జిల్లాలో అక్కడక్కడా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రైతు కుటుంబాల నిర్ధారణ అంటూ గ్రామ స్థాయి సభలు చేపట్టారు. అయినా ఇంత వరకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ పథకం అమలు జరగలేదు. ఇదిలా ఉండగా, అన్ని రకాల సమస్యలను పరిగణలోకి తీసుకుంటే దాదాపు 10వేల మంది రైతులు అర్హత ఉండి కూడా రుణమాఫీ అందుకోలేదన్న అంచనా ఉంది.

**రైతు భరోసా లేక..**

ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.7,500లు రైతుభరోసా పథకం ద్వారా ఇస్తామన్న హామీ పూర్తిగా ఆటకెక్కింది. రెండు సీజన్లకు కలిపి రూ.15వేలు అందిస్తామంటే రైతన్నలు నమ్మకంతో ఎదురు చూశారు. సాగు కోసం సాయం అందించాల్సిన రైతుభరోసా వానకాలం పంట చేతికి వచ్చినా దిక్కులేకుండా పోయింది. చివరకు వానకాలం సీజన్ రైతుభరోసా ఇవ్వలేమని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి చెప్పడం రైతుల్లో మరింత ఆగ్రహావేశాలు పెంచేలా చేశాయి.

**పంట రుణాలు అంతంతే..**

వానకాలం సీజన్ ముగిసినప్పటికీ పంట రుణాలివ్వడంలో అధికారులు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 30శాతం కూడా రుణాల పంపిణీ జరగలేదంటే బ్యాంకుల పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతున్నది. జిల్లాలో పంట రుణ లక్ష్యం రూ.3454.92 కోట్లుండగా, మార్చి నుంచి సెప్టెంబర్ వరకు 51,991 మంది రైతులకు రూ.539.68కోట్లు ఇచ్చారు. ఈ లెక్కన సగం లక్ష్యం కూడా దాటని పరిస్థితి నెలకొన్నది.

## రైతు నిరసనకు హరీశ్‌రావు



కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు, రైతుల పక్షాన నిలబడి భరోసానిచ్చేలా బీఆర్‌ఎస్ రైతు నిరసన సదస్సుకు శ్రీకారం చుట్టింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీపంలో పాలకేంద్రాన్ని అనుసరించి మైదానంలో సదస్సు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

రైతుల నిరసన సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సభాస్థలిని ఏర్పాటు చేయాలని, అవసరమైన వసతులు కల్పించాలని నాయకులకు సూచించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి అక్కడి నుంచి రైతులు, నాయకులు ర్యాలీగా సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అభిలాష్‌రావు, గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేశ్‌గౌడ్, అశోక్, విష్ణు, హేమంత్, శ్రీను, రాము, జోహెబ్, హుస్సేన్, క్రాంతి తదితరులు మాజీ మంత్రి వెంట ఉన్నారు.


రైతు నిరసన సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి

- ఉమ్మడి జిల్లాలోనే పెద్ద జాతర
- లక్షలాదిగా తరలి రానున్న భక్తులు


కురుమూర్తి స్వామి ఆలయ రాజగోపురం

# కురుమూర్తిరాయుడి సేవకు వేళాయే..


కురుమూర్తి స్వామి మూలవిరాట్

- 31 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 19 రోజులపాటు అంగరంగ వైభవంగా..
- 6న అలంకారోత్సవం, 8న ఉద్దాలోత్సవం
- ఏర్పాట్లల్లో అధికారులు, పాలకవర్గం

**ఉత్సవాలు ఇలా..**

- అక్టోబర్ 31న కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- నవంబర్ 1న ఆవాహిత దేవతాపూజలు
- 2న ధ్వజారోహణం, 108 అష్టోత్తర శతకలశాభిషేకం, స్వామి కల్యాణం, మయూర వాహనసేవ
- 3న ప్రత్యేక పూజలు, హంసవాహన సేవ
- 4న శేషవాహన సేవ
- 5న ప్రత్యేక పూజలు, గజవాహన సేవ
- 6న స్వర్ణాభరణాలచే అలంకారం, అశ్వవాహన సేవ
- 7న హనుమద్వాహన, గరుఢ వాహనసేవ
- 8న ఉద్దాలోత్సవం, ఉదయం ప్రత్యేక పూజలు
- 9న ఆవాహిత దేవతా పూజలు, హోమాలు, పుష్పయాగం
- 10న అవభృత, మంగళ నీరాజనం, ఉత్సవ పూజలు
- 18న స్వామి స్వామి అలంకారం తీయడం

మూసాపేట(చిన్నచింతకుంట), అక్టోబర్ 28 : అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కొలిచిన వారికి కొంగుబంగారంగా కురుమూర్తి రాయుడు పేరొందాడు. అంతటి మహిమాన్వితుడు.. ఏడుకొండల మధ్య కాంచనగుహలో కొలువుదీరిన స్వామిని భక్తులు కొలిచేందుకు వేళైంది. ఈ ఏడాది ఈనెల 31 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత ప్రాధాన్యత కలిగి ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. జాతరలో ప్రధానమైనది ఉద్దాలోత్సవం. ఇంటిదైవంగా భావించే భక్తులు దేశంలో ఎక్కడ ఉన్నా స్వామివారి ఉద్దాల ఉత్సవాలకు తప్పనిసరిగా కుటుంబ సమేతంగా వారం రోజుల ముందుగానే సొంతూళ్లకు చేరుకుంటారు. ఇండ్లను శుద్ధి చేసుకొని కుటుంబ సమేతంగా బండ్లు, వాహనాలపై లక్షల్లో తరలివస్తారు. స్వామివారిని కొలిచి, రాత్రి మొత్తం అక్కడే ఉండి స్వామి సన్నిధిలో బస (జాగారణ) చేస్తారు. అక్టోబర్ 31వ తేదీ నుంచి కురుమూర్తి స్వామి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. నవంబర్ 2న స్వామివారి కల్యాణోత్సవం, 6న స్వామివారి అలంకారోత్సవం, 8న ఉద్దాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ప్రధాన ఘట్టం.. ఉద్దాల ఊరేగింపు**

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఉద్దాల ఊరేగింపే ప్రధాన ఘట్టం. పల్లమర్రి నుంచి చాటను ఊరేగింపుగా వడ్డేమాన్ వరకు తీసుకొస్తారు. అక్కడే నియమ నిష్ఠలతో తయారు చేసిన స్వామివారి పాదుకల(ఉద్దాల) ఊరేగింపు భారీ బందోబస్తు మధ్య ఆలయం వరకు కొనసాగడం ఆనవాయితీగా వస్తుంది. ఉద్దాల వేడుకకు ప్రజాప్రతినిధులతో పాటు లక్షల్లో భక్తులు తరలిరానున్నారు. ఏర్పాట్లపై ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇప్పటికే సమావేశాలు నిర్వహించారు.

**భక్తులకు బస్సు సౌకర్యం..**

బ్రహోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, దేవరకద్ర, వనపర్తి, మరికల్, మక్తల్ తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. కాగా, ఆలయ పరిసరాల్లో మత్తు పదార్థాలు అమ్మడం, జూదం ఆడడం నిషేధించినట్లు అధికారులు తెలిపారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమెందుకు?

- బీఆర్‌ఎస్‌వీ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య
- కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా

గద్వాల, అక్టోబర్ 28 : విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం 200మంది విద్యార్థులతో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడారు. విద్యావ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయకపోవడంతో ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తాళాలు వేసి రోడ్లపైకి వచ్చి ధర్నా చేసే పరిస్థితి ప్రభుత్వం కల్పించడం బాధాకరమన్నారు. చాలా మంది స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో కళాశాలల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలను గాలికొదిలేయడంతో నిత్యం సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకురాలు ప్రేమలత, విద్యార్థి విభాగం నాయకులు మాధవ్, మత్తాలి, ఖాజావలి, సోమశేఖర్‌నాయుడు, నర్సింహా, వీరేశ్, రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



గద్వాల కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు



ఆత్మకూర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆత్మకూరు, అక్టోబర్ 28 : పెండింగ్‌లో ఉన్న రూ.7,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్, జిల్లా కన్వీనర్ అర్జున్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులతో సోమవారం ఆత్మకూరులోని గాంధీచౌక్‌లో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఎన్నికలకు ముందు ఒకే విడుతలో రీయింబర్స్‌మెంట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల భవితకు ఆటంకం కలగకుండా వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అనంతరం పోలీసులు విద్యార్థులతో మాట్లాడి విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, నిజగుణ, సందీప్, అనిల్, మాణి తదితరులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటిక కబ్జా!


క్రిస్టియన్‌పల్లి శివారులో సర్వే నెంబర్ 429లోని ప్రభుత్వ భూమిని చదును చేసిన కబ్జాదారులు

- ప్రశ్నించిన స్థానికులకు బెదిరింపులు
- అధికారులకు చెప్పినా ఫలితం శూన్యం
- బైపాస్ రోడ్డు రాకతో ఆక్రమణలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 28 : దళితులు ఎవరైనా చనిపోతే వారిని పూడ్చడానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని కొందరు స్వార్థపరులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాకెవరు లేరు అడ్డం.. అన్నట్లు వారి వ్యవహారం తయారైందని పాతపాలమూరు వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు కలెక్టర్, మరో వైపు ఎస్పీ, జిల్లా ఉన్నతాధికారులు ఉన్నా జిల్లా కేంద్రంలోనే ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు కేటాయించిన భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని పలువురు 'నమస్తే తెలంగాణ'తో వాపోయారు. జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి శివారులోని సర్వేనెంబర్ 439 లో ఉన్న నాలుగు ఎకరాల 20గుంటల ప్రభుత్వ భూమిని చాలా ఏండ్ల నుంచి శ్మశాన వాటికకు వినియోగిస్తున్నారు. అయితే పాతపాలమూరుకు చెందిన నలుగురు వ్యక్తులు ఈ భూమిలో హిటాచీతో చెట్లను తొలగించడమే కాకుండా కంప్రెషనర్‌తో బండరాళ్లను పగలగొడుతూ భూమిని చదునుచేస్తున్నారని, ప్రశ్నిస్తే ఎవరికి చెబుతారో చెప్పుకోండని బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ప్రజావాణిలో, మహబూబ్‌నగర్ అర్బన్ తాసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. కాగా, ఈ భూమి సమీపం నుంచే బైపాస్ రోడ్డు వస్తుండడంతో భూముల విలువ పెరగడంతో కబ్జాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ప్రభుత్వ భూమిని కాపాడాలి..**



సర్వేనెంబర్ 439 ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా కాపాడాలి. ఈ విషయమై తాసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశాం. అన్యాయంగా ప్రభుత్వభూమిని బాలకృష్ణ, రామకృష్ణ, గోవర్ధన్, ధనుంజయ్ అనే వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

**– నర్సిములు, పాతపాలమూరు వాసి**

**అధికారులు స్పందించాలి..**



దళితుల శ్మశానవాటికకు చెందిన భూమిని కొందరు కబ్జా చేస్తున్నారు. కబ్జా విషయం అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేయగా, వచ్చి చూసి వెళ్లడమే కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు స్పందించి శ్మశానవాటిక భూమిని కాపాడాలి.

**– యాదయ్య, పాతపాలమూరు వాసి**

**చర్యలు తీసుకుంటాం..**

సర్వేనెంబర్ 429లో ప్రభుత్వ భూమి ఉన్నది. భూమిని కబ్జా చేశారని కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే చేయించాం. రికార్డులు పరిశీలించి ప్రభుత్వ భూమి అయితే ఏ స్థాయిలో ఉన్న వారిపై చర్యలు తీసుకుంటాం.

**– ఘన్సీరాం, మహబూబ్‌నగర్ అర్బన్ తాసీల్దార్**

నిధుల దుర్వినియోగంపై..

# విచారణకు కలెక్టర్ ఆదేశం

- ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ
- సెలవుపై వెళ్లిన మండల అధికారి

నమస్తే ఎఫెక్ట్

నవాబ్‌పేట, అక్టోబర్ 28 : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విజయేందిర బోయి ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'పారిశుధ్యం నిధులకు అవినీతి చెదలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితోపాటు కలెక్టర్ విజయేందిర బోయి స్పందించారు. గ్రామ పంచాయతీల్లో జరిగిన అవినీతి అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కలెక్టర్‌ని కోరడంతో ఆమె స్పందించి అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారులను విచారణ అధికారులుగా నియమించినట్లు తెలిసింది. కాగా, ముగ్గురు అధికారుల బృందం సోమవారం విచారణ చేపట్టాల్సి ఉండగా, అవినీతి అక్రమాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి అందుబాటులో లేకపోవడంతో వాయిదాపడింది. కాగా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మండల స్థాయి అధికారి నాలుగైదు రోజులు సెలవు పెట్టి వెళ్లినట్లు సమాచారం. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ మిషన్లు, సింగిల్‌ఫేజ్ మోటర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతి అక్రమాలను ఒకరిద్దరు ప్రణాళిక ప్రకారం పంచాయతీ కార్యదర్శులపై మోపేందుకు ప్రయత్నించగా, ఫలించలేదు. కొంత మంది అధికారులే నిధులు స్వాహా చేసి తమను వేధిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మహమ్మదాబాద్‌లో అంబాభవానీ ట్రేడర్‌పై క్లెయిమ్ అయిన బిల్లులపై సమగ్ర విచారణ జరపాలని పంచాయతీ కా ర్యదర్శులు కోరుతున్నారు.

# ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

అయిజ, అక్టోబర్ 28 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. సోమవారం ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 31,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 33,100 క్యూసెక్కులు నమోదైంది. పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.357టీఎంసీల నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 21,378 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 21,378 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 19,945 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 18,158 క్యూసెక్కులు నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.40 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.56 టీఎంసీలు ఉన్నది.

**టీబీ డ్యాం, ఆర్డీఎస్‌కు..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 15,792 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 15,432 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠసామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.773 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 30,387 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 29,700 క్యూసెక్కులు సుంకేశుల ప్రాజెక్టులోకి చేరుతున్నది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 687 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 10.2 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది.

**నల్లమలలో రోడ్డుపై చిరుత**



అచ్చంపేట, అక్టోబర్ 28 : నల్లమలలో చిరుత రోడ్డు దాటుతున్న దృశ్యం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై చిరుతను అచ్చంపేటకు చెందిన యాత్రికులు చూసి వారి ఫోన్‌లో బంధించారు. దోమలపెంట సమీపంలో కనిపించిందని మన్ననూర్ ఎఫ్‌ఆర్‌వో రవి తెలిపారు.


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నడిగడ్డ పోరాట సమితి సభ్యులు

## రాజేశ్వరి మృతికి కొవ్వొత్తులతో నివాళి

మల్దకల్, అక్టోబర్ 28 : మల్దకల్ మండలంలోని బిజ్వారానికి చెందిన మైనర్ బాలిక వడ్డె రాజేశ్వరి మృతిచెందగా, నడిగడ్డ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మప్ప, బజారన్న, మల్దకల్,రాజు ఉన్నారు.

## ఇసుక మాయం

- డబుల్ బెడ్రూం నిర్మాణాల కోసం నిల్వ
- రాత్రికి రాత్రే తరలించిన నాయకులు
- పట్టించుకోని అధికారులు


డబుల్ బెడ్రూం వద్ద ఉన్న ఇసుక నిల్వ

మక్తల్, అక్టోబర్ 28 : మక్తల్ పట్టణానికి కూతవేటు దూరంలో సర్వేనెంబర్ 971లో పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని కేసీఆర్ సర్కారు ప్రారంభించింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోయాయి. కాగా, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక ఇండ్ల నిర్మాణం కోసం తీసుకొచ్చిన ఇసుకను ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలను చూసుకొని కొందరు నాయకులు రాత్రికి రాత్రే ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. రెండు నెలల కిందట సైతం మాజీ ప్రజా ప్రతినిధి రెండు టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించినట్లు ఆరోపణలున్నాయి. అధికారం ఉందని ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా తరలించడం సరికాదని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి ఇసుక తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం..**

మక్తల్ సమీపంలోని డబుల్ బెడ్రూం నిర్మాణాల వద్ద ఉన్న ఇసుకను తరలించిన విషయం తమ దృష్టికి రాలేదు. ఆర్ఐతో వి చారణ చేపట్టి ఇసుక అక్రమంగా తరలించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. **– సతీశ్‌కుమార్, తాసీల్దార్**